


పత్రిక సంపాదకులకు—

అయ్యా,

నా కలం బలం చవిచూపించాలనే కుతూహలంతో ఈ జాబు వ్రాస్తున్నా. జన్మతః సౌరభాలు విరజిమ్మిన అస్మద్రచనా పాటవం వ్యర్థంకావడం నా కెంతమాత్రం ఇష్టం లేదు. పిన్నవయసులోనే 'అఖిలభారత కథానికల పోటీ'లో పాల్గొని ఒక సంతాప సూచక (కన్సొలేషన్) బహుమతిని పొందాను. ఉగాది కథానికల పోటీలో ద్వితీయ బహుమతి గడించుకున్న కథను పదిలంగా నా స్వదస్తూరీలో వ్రాసి పై నుదహరించిన పోటీకి పంపుకున్నాను కథ లోని ఇతివృత్తం బాగుందని అభిప్రాయ బడ్డ న్యాయనిర్ణేతలు కథకుని కింకా కథా గమనంలో అనుభవం చాలదను కున్నట్లుగా, రచయితకు మంచి భవిష్యత్తు కలదను కున్నట్లుగా రూఢిగా తెలియవచ్చినది. ఈ జాబుతోపాటు నేను పంపిన కథను పరి శీలించండి. ఇతివృత్తం కొడవటి గంటిది, రచనాశైలి రాచకొండవారికి అనుకరణ, కథా కథనం చలం అడుగుజాడలో. పాత్ర లెంతమాత్రం (స్వ) కల్పితాలు కావు. సజీవ మైన ఈ కథలోని పాత్రలుద్వేగపూరి తాలు. వాస్తవిక జీవిత దృశ్యాల్ని యథా తథంగా చిత్రించగల్గే విశ్వకవి టాగూరు కథన శైలి నాకలవడింది. పాఠకునిలో తీవ్రాలోచనలను రేకెత్తిస్తుంది నాకథ. మొత్తంగా అందరి అభిరుచులను ఆక ర్షించే అయస్కాంతం నా రచన.

రచయిత

'రమణ'

శ్రీ 'రమణ' గార్కి,

అభినందనములతో మీ రచన త్రిప్పి పంపడ మైనది. అమూల్యమైన మీ కథా సమయాన్ని సద్వినియోగ పర్చుటలో అశక్తుల మగుచున్నందుకు చింతిస్తున్నాము. మీ సహకారానికి మే మెంతో కృతజ్ఞులము.

సంపాదకుడు.

సంపాదకులకు—

మహాశయా,

మీ తిరస్కృత తిరుగుటపా నాలో నవ చైతన్యాన్ని పురికొల్పింది. ప్రసిద్ధులైన ప్రచురణకర్తలకు రేడియో ప్రసారితకథలు పంపి పత్రికలువేయించి అనేక పారితోషికా లందుకొన్న నా ఆప్తమిత్రుని సలహా ఈ సందర్భంలో స్వీకరించవలసి వచ్చింది. ఈ ఉద్యమ మిట్లా నిరాఘాటముగా కొనసాగిం చాలని నా మిత్రుని సలహా. కథ నెలాగైనా స్వీకరించి మీ వీలునుబట్టి ప్రచురించండి.

భవదీయుడు

'రమణ'

'రమణ'గార్కి,

అయ్యా, మీ రచనను మరల త్రిప్పి పంపడమైనది. మళ్ళీ ప్రచురణకై పంప వద్దని హెచ్చరిస్తున్నాము.

సంపాదకుడు.




సంపాదక మహాశయా,

మీరు కేవలం నా సహనాన్ని పరీక్షిస్తు న్నారనే విషయాన్ని గుర్తించాను. వివిధ తరహా రచనలను పరిశీలించే పని యొత్తి డిలో పనికి రాని వట్టి చెత్తను ఉత్తమంగా ఎన్నుకొనే పొరపాటు జరగవచ్చును. కాని చక్కటి ఇతివృత్తం, చక్కటి సన్నివేశాల బరువుతో కూడిన యిట్టి కథలు అరుదుగా లభిస్తాయి. చేజిక్కిన సదవకాశం జారనీయ కండి. అందుచేత కథ నెలాగైనా భరించి ప్రచురించండి.

శ్రేయోభిలాషి

'రమణ'

'రమణ' గార్కి,

స్వామీ, మీ కథ మళ్ళీ త్రిప్పి పంపు తున్నాం. వాస్తవానికి మీరంపిన కథ ప్రచు




రణకు తగ్గ స్థాయిలో లేదు. ప్రచురించే పక్షంలో మా పత్రిక స్థాయి దిగజారు తుంది. దయయుంచి ఇకనైనా మీ ప్రయత్నం విరమించండి.

సంపాదకుడు.

సంపాదక మహాశయులకు—

ఆర్యా, మీ చివరి జాబు నాలో ధైర్యాన్ని రగుల్కొల్పింది. ఒక రకమైన అభిప్రాయం నా రచనలపై మీరేర్పరుచుకున్నందుకు ధన్యుడ్ని. ద్విగుణీకృతమైన ఉత్సాహాతిశయ ములతో, ఆశాభావంతో దానినే మరల పంపుచున్నాను.

సౌభ్రాత్రముగా

'రమణ'

'రమణ'గారూ,

ప్రచురణకై మీరంపిన కథలో పటిమ గాని జీవంగాని పాత్రోచితగాని మచ్చుకైనా

కానరాదు. నిజం చెప్పాలంటే మీ కథ కర్థం పర్థం లేదు. అట్టి కథను మేమెంత మాత్రం స్వీకరించలేము.

సంపాదకుడు

సంపాదకులకు

మీ కట్టు కడపటి జాబు చూచిన నా ఆనందావధులకు మేరలేకపోయింది. నాగమ్యం దరిదాపుల్లో ఉందని గ్రహించాను. మీ దృక్పథం నన్నెంతగానో ఆకర్షిస్తోంది. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న ఈ ఉద్యమ బలమే మరల ఒకసారి నా కథ మీకు పంపే టట్లు ప్రోత్సహించినది.

'రమణ'




'రమణ'గార్కి,

అయ్యా, దయచేసి ఈ జాబుతో జత పర్చిన పదిరూపాయల చెక్కును స్వీకరించండి. ఇక మీ కథపైన సమస్త హక్కులు మావి. దీనివల్ల మాకు అమూల్యమైన కొనొ వనాలు కలిసి వచ్చాయి. మీ కథ ఇప్పుడు మా సొంతం. మరల ఇదే కథను మీరంపిన పక్షములో చట్టబద్ధమైన చర్య మీపై తీసుకొనగలమని ఇదే మా హెచ్చరిక. ఈ విషయంలో న్యాయస్థానానికి వెళ్ళినా చట్టం మా పక్షం ఉందనే విషయం విస్మరించకండి.

సంపాదకుడు. ●

# ఆప్తబంధువులు



ధర్మపథం. బులుసు వేంకటరమణయ్య

నీతిచంద్రిక చదివినవారికి అందరికీ అందులో చిన్నయ సూరిగారు చెప్పిన 'లోకములో మాతా పితలు, మిత్రుడు అనే ముగ్గురే ఆప్తులు' అనే మాట బాగా జ్ఞాపకం వుంటుంది. వాస్తవంగా మనమేలు కోరేవారు తలిదండ్రులూ, స్నేహితులూ మాత్రమే! తక్కిన బంధువులు కేవలం మేలు కోరేవారని చెప్పడానికి వీలుండదు. ఏదో మేలుకోరినట్లు చెప్పితే — అందులో కొంత స్వార్థం ఉంటుందని అనుకోవలసే ఉంటుంది.

అయితే — ఈ ముగ్గురేనా ? మరే ఆప్తులూ ఉండరా? అని అడగవచ్చు. కొంచెం ఆలోచించి చూస్తే మరి ముగ్గురు-ఆప్తులు దొరుకుతారు. వారు — సోదరుడు, భార్య, పుత్రుడున్నూ.

రామునికి లక్ష్మణునివంటి సోదరుడు ఉన్నట్లు, సోదరులలోనూ ఉత్తములు ఉండవచ్చును. అట్టి సోదరులు కష్టాల్లో ఆదుకోవడమూ సహజమే. అందువల్ల సోదరుణ్ణి కూడా ఆప్తుల్లో చేర్చుకోవలసిందే!

ఇక — మానవుడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించక ఏకాకిగా ఉండడం అరుదు. వివాహం చేసుకొనడం, సంతానవంతుడు కావడమూ సహజం. వివాహితుడు గృహస్థుడైన వ్యక్తికి—తనతోపాటు కష్టసుఖాలను పంచుకునే భార్య ఆప్తురాలయి వుండనే వుంటుంది. తన చావి జీవితానికి ఆధారమైన పుత్రుడున్నూ ఆప్తుడుగానే ఉంటాడు. ఈ విధంగా ఆప్తులు ఆరుగురు లెక్కలోకి వస్తారు.

మానవుడు లౌకిక వ్యవహారాలతో సంబంధం పెట్టుకొని ఉన్నప్పుడూ, గృహస్థుగా ఉంటున్నప్పుడూ ఈ ఆరుగురున్నూ ఆప్తులు అగుదురు. కాని, ఇట్టి సంబంధాలు లేక పారలౌకికదృష్టి కలిగినప్పుడు ఉండే ఆప్తులు వేరు. ఆ సంగతినే ఈ శ్లోకం వివరిస్తున్నది.

'సత్యం మాతా పితా జ్ఞానం
ధర్మో భ్రాతా దయా సఖా;
శాంతిః పత్నీ క్షమా పుత్రః
షడేతే మమ బాంధవాః'

నాకు సత్యమే తల్లి; జ్ఞానమే తండ్రి; ధర్మమే సోదరుడు; దయయే మిత్రుడు; శాంతియే భార్య; క్షమయే పుత్రుడు — లోకంలో ఆప్తులయిన ఆరుగురు బంధువులు తల్లి మొదలైన వారయితే — నాకు సత్యం మున్నగునవియే బంధువులు — అని దీని అభిప్రాయం.

పారమార్థిక దృష్టి ఉన్నవారికి తల్లి తండ్రి మున్నగువారు ప్రధానంగా ఉండే ఆప్తులు కారు. వారికి సత్య— జ్ఞాన— దయా—ధర్మ— క్షమా— శాంతులే ముఖ్యమైనవి.

ఇట్టి ఉత్తమగుణాలను అందరూ అలవరచుకోవాలి. మనం ఆత్మబంధువులు ఆరుగురినీ ఏవిధంగా గౌరవిస్తామో, అటువంటి గౌరవాన్నే సత్యము మున్నగు వాటియందు చూపాలి.

వాటిని గౌరవించడమంటే- ఆ ఉత్తమగుణాలను ఆచరణలో పెట్టడమే అసలుమాట ! ●